RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 267 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | ఆదివారం, 31 మార్చి 2024 | పేజీలు : 4 | వెల : 2/-

## ఇది కదా పొలిటికల్ రివెంజ్ అంటే..

## కేసీఆర్ చేసాడు.. రేవంత్ చెప్పి చేస్తున్నాడు?

# కేసీఆర్‌కు ఇక మైండ్ బ్లాకే...!



**సీఎం రేవంత్‌రెడ్డి గేట్లు తెరవడంతో కారు దిగి కాంగ్రెస్‌లోకి పరుగులు తీస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. ఒకప్పుడు కారెక్కేందుకు ఏ రేంజ్‌లో అయితే స్పీడ్ చూపించారో ఇప్పుడు అదే స్పీడ్‌తో కారులోంచి దూకేస్తున్నారు. అసలు ఈ చేరికలన్నీ రేవంత్ సెంట్రిక్‌గానే జరుగుతున్నాయా? రేవంత్ బీఆర్ఎస్‌ను మరో టీ-టీడీపీగా మార్చాలనుకుంటున్నారా? అత్యంత సన్నిహితులు, సీనియర్లను పార్టీలోకి పిలిచి కేసీఆర్‌ను మానసికంగానూ దెబ్బకొట్టాలని చూస్తున్నారా? అసలు రేవంత్ టార్గెట్ ఏంటి?**

గేట్లు తెరుస్తాం ఖబర్దార్ అన్న సీఎం రేవంత్‌రెడ్డి అన్నట్లుగానే చిన్న గేట్లు కాదు భారీ గేట్లే తెరిచి వలసలను ఓ రేంజ్‌లో ఎంకరేజ్ చేస్తున్నారు. దీంతో గులాబీ పార్టీ నేతలు కాంగ్రెస్ లోకి గుంపులుగా వెళ్లిపోతున్నారు. చిన్నా పెద్దా, సీనియర్, జూనియర్ అన్న తేడా లేకుండా ఆపరేషన్ ఆకర్ష్‌తో లీడర్లందరికి షేక్ హ్యాండిస్తోంది తెలంగాణ కాంగ్రెస్. మీ భవిష్యత్తుకు మా భరోసా అంటూ వచ్చిన వారికి వచ్చినట్లు కండువా కప్పేస్తోంది. దీంతో బీఆర్ఎస్ కాస్త కళ తప్పింది. ఆరు నెలల క్రితం వరకు ఫుల్ టైట్‌గా ఉన్న కారు.. జంపింగులతో కొంత ఖాళీగా కనిపిస్తోంది. ఇదంతా సీఎం రేవంత్ వ్యూహాత్మకంగానే చేస్తున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టేందుకు చూస్తున్నారంటున్నారు విశ్లేషకులు. అంతేకాదు రాష్ట్రం ఏర్పడ్డాక పూర్తిగా ఉనికి కోల్పోయిన టీ-టీడీపీలా బీఆర్ఎస్‌ను చేయాలని చూస్తున్నారన్న చర్చ ఊపందుకుంది. కాంగ్రెస్ పార్టీలో లీడర్ల చేరికల సంగతి అలా ఉంటే%ణా% కేసీఆర్ బలంగా నమ్మిన వ్యక్తులు , వెన్నంటే ఉన్న నేతలు, కుటుంబ సభ్యుల హోదా తీసుకున్న నాయకులు సైతం కాంగ్రెస్‌కు క్యూ కట్టడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కేసీఆర్ మాటే శిరోధార్యమనుకునే కీలక నేతలు కడియం, కేకే, బొంతు రామ్మోహన్ లాంటి చాలా మంది నాయకులు బీఆర్ఎస్‌కు బై చెప్పడం వెనుక రేవంత్ వ్యూహాలున్నట్లు చర్చ జరుగుతోంది. రేవంత్ టార్గెట్ కేవలం బీఆర్ఎస్‌ను ఖాళీ చేయడమే కాదు వెన్నంటే ఉంటూ మంచిచెడు మాట్లాడుకునే సాన్నిహిత్యం ఉన్న వాళ్లను సైతం పార్టీలోకి చేర్చుకుని కేసీఆర్‌ను మానసికంగానూ కుంగదీడమే రేవంత్ లక్ష్యమన్న వాదనలు వినిపిస్తున్నాయి. అంతేకాదు ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో రేవంత్ గతంలో మాట్లాడిన మాటలను తెరపైకి తీసుకొస్తున్నారు బీఆర్ఎస్‌ను బొంద పెడతామంటూ సీఎం కాకముందు ఎన్నో సార్లు డైలాగులు పేల్చారు రేవంత్. అయితే సీఎం అయ్యాక అలాంటివేం ఉండవనుకునే లోపే దావోస్‌నూ సేమ్ డైలాగులు రిపీట్ చేశారు. బీఆర్ఎస్‌ను తొక్కేస్తామంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దానికి అనుగుణంగానే రేవంత్ అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. మొత్తంగా బీఆర్ఎస్‌తో పాటు కేసీఆర్ టార్గెట్‌గా రేవంత్ పాలిటిక్స్ నడుస్తున్నాయంటున్నారు రాజకీయ విశ్లేషకులు. మరి రేవంత్ వ్యూహాలకు కేసీఆర్ ఎలా చెక్ పెడతారు? గులాబీ పార్టీకి పూర్వవైభవం ఎలా తీసుకొస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# ఖమ్మంలో ఏకాకిగా మారిన బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా...



ఖమ్మం : ఎన్నికల నగారా మోగడంతో పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. వాస్తవానికి అధికారుల ఏర్పాట్ల కంటే వేగంగా రాజకీయ పార్టీలు ఈ ఎన్నికల యుద్ధంలో తలమునకలు కావాల్సి ఉంది. అయితే అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ %దీ=ా% పార్టీ మొన్నటి ఎన్నికల ఫలితాల దెబ్బ నుంచి ఇంకా కొలుకున్నట్లు కనిపించడం లేదు. ఫలితంగా ఖమ్మంలో ఆ పార్టీ కేడర్ ఇంకా నిస్తేజంలోనే కునరిల్లుతోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు కలకళలాడిన జిల్లా కేంద్రలోని పార్టీ కార్యాలయం తన మొఖం చూసే కార్యకర్తలు లేక వెలవెలబోతోంది. దీంతో పార్లమెంట్ ఎన్నికల సమరాంగానికి గులాబీ కేడర్ ఇంకా సిద్ధమవ్వనట్లే తేటతెల్లం అవుతోంది. బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ నామా నాగేశ్వరరావును ప్రకటించినా ఆయన శిబిరంలోనూ ఎన్నికల హడావుడి ఏమాత్రం కనిపించడం లేదు.

## ముఖం చాటేస్తున్న మాజీ మంత్రి..

**జిల్లాకు దూరంగా మాజీ మంత్రి..** అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ కొడతామన్న ధీమాతో దూసుకుపోయిన ఖమ్మం మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌ను గత ఎన్నికల్లో ఓటమి పలకరించేసరికి తట్టుకోలేని స్థితిలోకి వెళ్లిపోయారు. దీంతో అధికారంలో ఉన్నప్పుడు వెంట తిరిగిన కీలక నాయకులకు సైతం ఆయన దూరంగా ఉంటున్నట్లు ఆ పార్టీ వర్గాలే చెప్పుకుంటున్నాయి. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత జరిగిన ఎన్నికల్లో ఖమ్మం జిల్లా కేంద్రంలో గెలిచి మంత్రి అయిన తొలి అమాత్యునిగా రికార్డు సృష్టించిన అజయ్ మొన్నటి ఎన్నికల్లో మునుపెన్నడూ లేనివిధంగా 50 వేల పైచిలుకు ఓట్ల భారీ తేడాతో ఓటమి పాలైన అపఖ్యాతిని సైతం మూటగట్టుకున్నారు. ఈ దుస్థితిలో ఆయన సొంత నియోజకవర్గానికి కూడా దూరంగానే కాలం గడుపుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.

హైదరాబాద్‌లో ఉంటూ చుట్టం చూపుగా మాత్రమే ఖమ్మం వస్తున్న పరిస్థితితో ఖమ్మంలో గులాబీ శ్రేణులు కకావికాలం అయ్యాయి. దీంతో ఎన్నికల యుద్దానికి సిద్ధం చేసే సారథే లేకుండా పోయారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో విస్తరించి ఉంది. మాజీ మంత్రి ప్రాతినిధ్యం వహించిన ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, కార్యకర్తల దుస్థితి ఎంతటి అగమ్యగోచరంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

**నేతల నడుమ కనిపించని ఐక్యత..** మాజీ మంత్రి తాజా తీరు ప్రస్తుత ఎన్నికల యుద్ధంలో గులాబీ పార్టీకి నష్టం తెచ్చేలా కనిపిస్తుండగా పార్టీ అధికారంలో కొనసాగినప్పుడు సైతం నేతల మధ్య సఖ్యత కనిపించలేదు. మంత్రిగా అజయ్.. ఎంపీలు, ఎమ్మెల్యేల స్వేచ్ఛను ఎప్పటికప్పుడు అదుపు చేసే ప్రయత్నమే చేశారన్న ప్రచారం జరిగింది. దీంతో ఎంపీగా ఉన్న నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్న వద్దిరాజు రవిచంద్రలతో పాటు మరికొందరు ఎమ్మెల్యేలు కూడా అజయ్ తీరుతో గతంలోనే ఇబ్బందులు పడినట్లు పార్టీ శ్రేణులు బహిరంగంగానే చర్చించుకున్నాయి. ఇటీవల గులాబీ బాస్ నేతృత్వంలో హైదరాబాద్ లో జరిగిన ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సామావేశంలో ఎంపీ వద్దిరాజు రవి.. మాజీ మంత్రి తీరుపై చేసిన నర్మగర్భ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో నేతల మధ్య సఖ్యత ప్రశ్నార్థకంగానే మారిపోయింది. ఈ క్రమంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ మంత్రి అజయ్ మనస్ఫూర్తిగా పని చేసే పరిస్థితి లేనేలేదని పార్టీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.

నేతల మధ్య నెలకొన్న ఈ అగాధం ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా మరోసారి బరిలోకి దిగుతున్న నామ నాగేశ్వరరావుకు మింగుడుపడని స్థితిని తెచ్చిపెట్టింది. పువ్వాడ తీరుతో ఈ ఎన్నికల్లో నామా ఒంటరిగా పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఓవైపు సొంత పార్టీలో కుంపట్లు ఇలా ఉంటే మరోవైపు జిల్లాలో బలమైన శక్తిగా ఎదిగిన కాంగ్రెస్ జోరు నామాకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి.




## కేటీఆర్‌పై క్రిమినల్ కేసు నమోదు..

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై.. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. సీఎం రేవంత్ రెడ్డి రూ. 2500 కోట్లు వసూలు చేసి కాంగ్రెస్ పెద్దలకు పంపారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై హనుమకొండ పోలీసులకు కాంగ్రెస్ నేత బత్తిన శ్రీనివాస్ రావు ఫిర్యాదు చేశారు. అయితే హనుమకొండ పోలీసులు ఆ కేసును బంజారాహిల్స్ స్టేషన్‌కు అక్కడి పోలీసులు బదిలీ చేశారు.

కేటీఆర్‌పై బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ 504,505(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

**అసలు కేటీఆర్ ఏమన్నారంటే..** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

తెలంగాణ భవన్‌లో జరిగిన సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమా? బీజేపీ ప్రభుత్వమా? అని అర్థం కావడం లేదన్నారు. సామంత రాజులా రేవంత్ ఢిల్లీకి రూ. 2500 కోట్లు కప్పం కట్టారని ఆరోపించారు. దీనికోసం ఆయన అందరినీ బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి.




## కేసీఆర్ కొత్త వ్యూహం!!

హైదరాబాద్ : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్‌కు వరుసగా షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న కీలక నేతలు అధికార కాంగ్రెస్ పార్టీలోకి నాన్ స్టాప్‌గా చేరుతూనే ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దగ్గర ఉండి వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఇటీవల ఐదుగురు సిట్టింగ్ ఎంపీలు పార్టీ మారి బీఆర్ఎస్ పార్టీకి షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. జహీరాబాద్, నాగర్ కర్నూలు ఎంపీలు బీబీ పాటిల్, రాములు బీజేపీలో, చేవెళ్ల, పెద్దపల్లి, వరంగల్ ఎంపీలు రంజిత్ రెడ్డి, వెంకటేశ్ నేత, పసునూరి దయాకర్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బొంతు రామ్మోహన్ లాంటి తదితర కీలక నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజాగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కే కేశవరావు.. కూతురు హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మీతో సహ పార్టీని వీడారు. మరోవైపు మరో సీనియర్ నేత, మాజీ మంత్రి కడియం శ్రీహరి తన కూతురు కడియం కావ్యతో సహా పార్టీని వీడారు. వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు.

# ఆ వలసలను కట్టడి చేయాలి!

**వలసలపై బీఆర్ఎస్ రియాక్షన్...** వలసలపై బీఆర్ఎస్ అధిష్టానం సీరియస్ అయ్యింది. పార్టీ నేతల వలసలను చెక్ పెట్టేందుకు పార్టీ హైకమాండ్ ఫోకస్ పెంచింది. ఈ క్రమంలోనే వ్యూహాలను రచిస్తున్న ట్లు సమాచారం. ముఖ్యంగా పార్టీ సీనియర్ నేత కడియం శ్రీహరి కూతురు అయిన కడియం కావ్యకు వరంగల్ ఎంపీ టికెట్ బీఆర్ఎస్ ప్రకటించింది. ఇతర కీలక నేతలను కాదని బీఆర్ఎస్ హైకమాండ్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్యను ప్రకటించింది.

**చెక్ పెట్టేందుకు నేతల కౌంటర్లు ....** నేడు వారు పార్టీకి గుడ్‌బై చెప్పడంపై అధిష్టానం గుస్స అయ్యింది. ఇది పార్టీకి భారీ డ్యామెజీగా బీఆర్ఎస్ హై కమాండ్ భావించింది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ నేతలు వరుసగా ప్రెస్‌మీట్లు పెట్టి తీవ్ర విమర్శలు చేస్తున్నారు. చేవెళ్లలో మాజీ మంత్రి కేటీఆర్, మెదక్ హారీష్ రావు, పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు తీవ్ర స్థాయిలో వలస వెళ్లిన నేతలపై మాటలతో విరుచుకపడ్డారు.

జిల్లా క్యాడ ర్ నుంచి రాష్ట్ర స్థాయి కీలక నేతల వరకు కాంగ్రెస్ పార్టీలోకి జంప్ అయిన నేతలను టార్గె ట్ చేసి మాట్లాడారు. ఈ క్రమంలోనే కడియం శ్రీహరి పై జిల్లా క్యాడర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. వరంగల్ లో బీఆర్ఎస్ శ్రేణులు కడియం దిష్టి బొమ్మలను దగ్ధం చేశారు.

**తెరపైకి పోటీ చేసే అభ్యర్థుల లిస్ట్...** వరంగల్ ఎంపీ టికెట్ కడియం కావ్య తిరస్కరించడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో పలువురు సీనియర్ నేతలు ఆ స్థానం పై కన్ను వేశారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ తరఫున వరంగల్ నుంచి పోటీ చేసే అభ్యర్థి ఎవరనేది చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే పలువురి బీఆర్ఎస్ నేతల పేర్లు తెరపైకి వస్తున్నాయి.

ముఖ్యంగా గతంలో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య.. బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్లు పొలిటికల్ సర్కిల్లో టాక్ నడుస్తోంది. మరోవైపు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ వరంగల్ ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్లు సోషల్ మీడియాలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అలాగే మరో కీలక నేత ఇటీవల ప్రజాశాంతి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అయిన ప్రముఖ సినీ నటుడు బాబూ మోహన్‌ను వరంగల్ బరిలో ఉంచాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయనకు ఫోన్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ టికెట్ అధిష్టానం ఎవరికీ కట్టబడుతుందో.. రెండు రోజుల్లో తెలిసే అవకాశం ఉంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## గళాలకు తాళం

### నాలుగు రోజుల్లో 40 మందికి ఈడీ నోటీసులు!

బలమైన గళం వినిపిస్తోందా? అది కూడా కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారుకు వ్యతిరేకంగా ఉందా? అయితే.. వెంటనే తాళం వేసేయండి! ఇదీ.. ఇప్పుడు కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కారు అవలంబిస్తు న్న విధానం. ఇప్పటి వరకు ఒక ఎత్తు. అంటే.. గడిచిన ఐదేళ్ల కాలంలో ఎలా జరిగిపోయిందో. ఏమో.. ఎంత మందికి ఈడీ అధికారులు నోటీసులు ఇచ్చారో.. ఎన్ని కేసులు పెట్టారో.. కానీ.. ఇప్పుడు కీలక సమయం. పార్లమెంటు ఎన్నికలకు సిద్ధమైన సమయం. ఈ నేపథ్యంలో విచ్చలవిడితనం పెరిగిపోయింది. గత ఐదేళ్లలో ఎంత మందికి నోటీసులు ఇచ్చారో లెక్కలు తెలియవు కానీ.. తాజాగా గడిచిన నాలుగు రోజుల్లో ఇంకా చెప్పాలంటే ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత.. అనూహ్యంగా దేశవ్యాప్తంగా ఉన్న బలమైన గళాలకు ఈడీ నోటీసులు ఇచ్చింది. వీరి సంఖ్య ఏకంగా 40 వరకు ఉందని తెలుస్తోంది. వీరిలో ముఖ్యమంత్రుల పిల్లల నుంచి మాజీ ముఖ్యమంత్రుల వరకు ఉన్నారు. ఇక్కడ కీలకమైన అంశం ఏంటంటే.. వీరంతా బలమైన గళంతో మోడీ ఓటు బ్యాంకును ప్రభావితం చేసేవారే కావడం గమనార్హం.

**ఇదీ లెక్క..** తాజాగా నాలుగు రోజుల్లో ఈడీ నోటీసులు ఇచ్చిన వారిని చూస్తే.. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె వీణ విజయన్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఫైర్‌బ్రాండ్ ఎంపీ మహు వా మొయిత్రా ఉన్నారు. అదేవిధంగా జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా, తమిళనాడు అధికార పార్టీ డీఎంకేకి చెందిన రాజా, యూపీ ప్రధాన ప్రతిపక్షం సమాజ్ వాదీ పార్టీకి చెందిన కీలక నేత, ఫైర్ బ్రాండ్, మోడీని ఓడిస్తామని చెప్పిన సోలంకి, మహారాష్ట్ర లోని ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన శివసేన నేత కీర్తికార్, బీహార్ ప్రధాన ప్రతిపక్షం ఆర్‌జేడీ ఫైర్ బ్రాండ్.. బీజేపీని గద్దె దింపుతామని ప్రతిజ్ఞ చేసిన సుభాష్ లు సహా అనేక మంది ఉన్నారు. మరి.. ఇదంతా చూస్తే.. దేశం ఎటు పోతోందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ప్రధానిని విమర్శించిన వారికి కూడా వార్నింగులు ఇస్తున్నారు. కర్ణాటకకు చెందిన తంగేడికి తాజాగా పోలీసులు నోటీసులు ఇచ్చారు. తమిళనాడుకు చెందిన మంత్రికి కూడా నోటీసులు ఇచ్చి కేసు నమోదు చేశారు. దీంతో అమర్త్యసేన్ వంటి నోబెల్ బహుమతి అందుకున్నవారు.. తాజాగా ప్రపంచ మీడియాతో మాట్లాడుతూ.. భారత దేశం నిరంకుశ వైఖరి దిశగా అడుగులు వేస్తోందని వ్యాఖ్యానించడం గమనార్హం.

## పైసలు కాదు.. ప్రయాణమే ముఖ్యం



హైదరాబాద్: ఇరవై కిలోమీటర్ల సిటీ బస్సు ప్రయాణానికి రూ.35.. 20 కిలోమీటర్ల మెట్రో ప్రయాణానికి రూ.50 వసూలు చేస్తున్నారు.. 20 కిలోమీటర్ల ఎంఎంటీఎస్ ప్రయాణానికి కేవలం రూ.5 మాత్రమే. బస్సులో గంటలకొద్దీ ప్రయాణ సమయం పడుతున్నా.. సీటు దొరక్కపోయినా, కాలుష్యం బారిన పడుతున్నా..అందులోనే ప్రయాణిస్తున్నారు. కారణం సకాలంలో ఎంఎంటీఎస్‌లు అందుబాటులో లేకపోవడమే. పైసలకు కాదు సమయానికే ప్రయాణికులు ప్రాధాన్యమిస్తున్నారు.

ప్రయాణికులు తగ్గడానికి కారణాలెన్నో..

మొత్తం 140 కిలోమీటర్ల మేర ఎంఎంటీఎస్‌లు పరుగులు పెడుతున్నా ప్రయాణించేవారు 40 వేలకు మించడంలేదు.

రైల్వే బోర్డు నిబంధనల ప్రకారం లోకల్ రైళ్లకు అధిక ప్రాధాన్యమివ్వాలి. ద.మ. రైల్వే పరిధిలో అది అమలుకావడం లేదు.

పెద్దగా ఆదాయం ఉండదని.. ఏ చిన్నకారణం దొరికినా సర్వీసులను రద్దు చేస్తుండటం

సమయపాలన లేకపోవడం.. సర్వీసు ఉంటుందన్న గ్యారంటీ లేకపోవడం

ఉదయం, సాయంత్రం కార్యాలయాలు, కళాశాలల సమయంలో ఎంఎంటీఎస్‌లు ఉన్నా, ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సగానికి సగం రద్దుకావడం

దూర ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్, గూడ్సు రైళ్లకు ప్రాధాన్యమిచ్చి.. ఆ సమయంలో అడ్డుగా ఉంటాయని ఎంఎంటీఎస్‌లను రద్దు చేస్తుండటం

మేడ్చల్ – సికింద్రాబాద్ మధ్య 10 సర్వీసులు ప్రతి రోజూ ఆలస్యమే.

ఘట్‌కేసర్ – లింగంపల్లి మధ్య రెండు సర్వీసులే నడుపుతుండటం

తెల్లాపూర్ వరకూ నగరం విస్తరించినా రెండు సర్వీసులకే పరిమితం చేయడం

ప్రయాణికుల లేకపోవడంతోనే ఎంఎంటీఎస్‌లు నడపడం లేదని ద.మ.రైల్వే చెబుతుంటే.. సమయపాలన పాటించకపోవడంతోనే ప్రయాణికులు దూరమయ్యారని నగర ప్రజలు ఆరోపిస్తున్నారు.

చౌకగా ప్రయాణించే అవకాశం ఉన్నా..

కేవలం రూ.5 టికెట్‌తో 20 కి.మీ., రూ.10తో 40 కి.మీ.,రూ.15తో 60 కి.మీ. ప్రయాణించే వెసులుబాటున్నా ఎంఎంటీఎస్‌లు ఎక్కడంలేదు. ఎంఎంటీఎస్ మొదటి దశ 45 కి.మీ.కు రెండోదశలో 95 కి.మీ. తోడైనా ప్రయాణికులు పెరగలేదు. మెట్రోలేని మార్గాలతో పాటు శివార్లను కలుపుతూ నలువైపులా అందుబాటులోకొచ్చినా అదే పరిస్థితి. సర్వీసుల సంఖ్య పడిపోయింది. ఒకప్పుడు 45 కి.మీ. మేర విస్తరించిన మొదటి దశలో 121 సర్వీసులు 1.20 లక్షల మందితో నడవగా... విస్తరించిన తరువాత ఎందుకు చతికిలబడిందంటే అనేక కారణాలున్నాయని నగర ప్రయాణికులు చెబుతున్నారు.

## సన్నని ధార...చాలని సరఫరా



హైదరాబాద్ : ఒకవైపు గ్రేటర్ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోగా.. జలమండలి అరకొర నీటి సరఫరా...అందులో తక్కువ ఒత్తిడితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నీళ్లు సరిపోక తిరిగి నీటి ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. ప్రధాన నగరం, శివారు మున్సిపల్ సర్కిళ్లలో రోజు విడిచి రోజు నీటి సరఫరా చేస్తున్నారు. ఓఆర్‌ఆర్ పరిధిలోని ప్రాంతాలకు 3, 5 రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం 650 మిలియన్ గ్యాలన్ల పైనే అవసరం ఉండగా.. జలమండలి 559 ఎంజీడీల వరకు అందిస్తోంది. మిగతా జలాల కోసం బోర్లపై ఆధారపడేవారు. అయితే బోర్లు అడుగంటడంతో ఆ ప్రభావం జలమండలి నీటి సరఫరాపై పడుతోంది. దీంతో పలు ప్రాంతాల్లో సరఫరాలో కోత పెట్టడంతోపాటు లోప్రెషర్ సమస్యలు ఎదురవుతున్నాయి.

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో గతంలో కంటే అరగంట కోతపెట్టి.. ప్రస్తుతం 45 నిమిషాలు నీటి సరఫరా జరుగుతోంది. బాలాజీనగర్ డివిజన్ వివేక్‌నగర్‌లో కొన్నిచోట్ల లోప్రెషర్ సమస్య ఉంది. దీంతో నల్లాలకు మోటార్లు బిగిస్తున్నారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి, ఫిరోజ్‌గూడ, ఫతేనగర్, బాలాజీనగర్ డివిజన్లలో లోప్రెషర్ సమస్య తీవ్రంగా ఉంది.

హైదర్‌నగర్ డివిజన్ అడ్డగుట్టలోని కొన్ని ప్రైవేటు వసతి గృహాలకు సమయంతో సంబంధం లేకుండా తాగునీరు సరఫరా చేస్తుండగా.. భాగ్యనగర్‌కాలనీ, మిత్రాహిల్స్, హైదర్‌నగర్‌లో తక్కువ ఒత్తిడితో నీటి సరఫరా జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

ఒకవైపు నీటి కొరత.. మరోవైపు తాగునీరు వృథా అవుతోంది. మౌలాలి కమాన్ నుంచి చందాబాగ్ దారిలో ప్రభుత్వ పాఠశాల దాటాక సీసీ రోడ్డుపై లీకేజీ, దానికి పక్కనే మ్యాన్‌హోల్‌లో వాల్వు నుంచి తాగునీరు లీకై మురుగు కాలువలో కలుస్తోంది.

వెంగళరావునగర్, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలోని డి–బ్లాకు, కమాన్‌గల్లీ, జవహర్‌నగర్, మసీద్‌గడ్డ, వీడియోగల్లీ ప్రాంతాల్లో మూడు రోజులకోసారి నీళ్లు వస్తున్నాయని, అవి కూడా కేవలం 45 నిమషాలు మాత్రమే విడుస్తున్నారని వాపోతున్నారు.

## బల్దియా హస్తగతం!

హైదరాబాద్: గ్రేటర్‌లో పార్టీని బలోపేతం చేయడానికి అధికార కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్తోంది. రాష్ట్రంలో అనేక పురపాలక సంఘాలు, నగరపాలక సంఘాల పరిధిలో గత ఎన్నికల్లో భారాస అభ్యర్థులు గెలిచినా కూడా చాలా చోట్ల వీరంతా కాంగ్రెస్‌లో చేరుతున్నారు. దీంతో పాలకవర్గాలన్నీ కాంగ్రెస్ చేతికి వస్తున్నాయి. ఇదే విధంగా బల్దియాలో కూడా అధిక శాతం కార్పొరేటర్లను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ద్వారా ఎంఐఎం తోడ్పాటుతో హస్తగతం చేసుకోవాలని పార్టీ అగ్రనేతలు నిర్ణయించారు. ఇందులో భాగంగా బల్దియా మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో ఇటీవల జరిపిన చర్చలు సఫలం కావడంతో.. శనివారం ఆమె కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఆమె వెంట 5–10 మంది కార్పొరేటర్లు సైతం కాంగ్రెస్‌లో చేరతారని నేతలు చెబుతున్నారు.

డివిజన్ స్థాయిలో బలోపేతానికి..

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకుని సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ బరిలో నిలిపింది. వికారాబాద్ జడ్పీ ఛైర్‌పర్సన్ సునీతా మహేందర్ రెడ్డిని సైతం కాంగ్రెస్‌లో చేర్చుకుని మల్కాజిగిరి నుంచి పోటీకి నిలిపారు. ఈ రెండు స్థానాల పరిధిలో 14 శాసనసభా నియోజకవర్గాలుండగా ఒక్కచోట కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యే లేరు. మొన్నటి ఎన్నికల్లో ఈ స్థానలన్నింటిలోనూ భారాస అభ్యర్థులు గెలుపొందారు. ఈ నేపథ్యంలో నగర పరిధిలోని చాలా నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్ కాంగ్రెస్‌కు లేదనే చెప్పాలి. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికలకు వెళితే ఫలితాలు అనుకూలంగా రావని ఆ పార్టీ నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. దీంతో గ్రేటర్‌లో పార్టీని బలోపేతం చేయాలంటే డివిజన్లపై పట్టుసాధించాలని సీఎం భావించారు.

లోక్‌సభ ఎన్నికల్లో విజయానికి ప్రణాళిక

గత బల్దియా ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఇద్దరే కార్పొరేటర్లు గెలిచారు.



ఇటీవల పరిణామాలతో కొందరు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆ పార్టీ బలం 10కి చేరింది. మరో 30 మంది కార్పొరేటర్లను చేర్చుకోవాలని అనుకుంటున్నారు. మరోవైపు కాంగ్రెస్‌లో చేరితే డివిజన్లలో పెద్దఎత్తున పనులు చేయించొచ్చన్న భావనలో కొందరు భాజపా, భారాస కార్పొరేటర్లు ఉన్నారు. ఇలాంటి వారిని గుర్తించి తమవైపు తిప్పుకోవాలని కాంగ్రెస్ అగ్రనేతలు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే మేయర్ విజయలక్ష్మితో కాంగ్రెస్ పెద్దలు మాట్లాడారు. పార్టీలో చేరడానికి ఆమె సుముఖత వ్యక్తం చేశారు. మేయర్ తండ్రి సీనియర్ భారాస నేత కె.కేశవరావు గురువారం మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈనెల 30న కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు మేయర్ విజయలక్ష్మి గురువారం సాయంత్రం ప్రకటించారు. ఆమెతోపాటు ఐదారుగురు కార్పొరేటర్లు కూడా పార్టీలో చేరనున్నారు. ఇప్పటికే డిప్యూటీ మేయర్ శ్రీలత హస్తం గూటికి చేరారు. ఇప్పుడు వీరిద్దరు కాంగ్రెస్ ఆపరేషన్‌లో భాగం కానున్నారని చెబుతున్నారు. మరో రెండు వారాల్లో మరింతమంది కార్పొరేటర్లను చేర్చుకోవడం ద్వారా మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు భారాస పార్టీకి అవకాశం లేకుండా చేయాలని భావిస్తున్నారు. దీనికి అనుగుణంగా ఇప్పటికే వ్యూహం రూపొందించారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## మూలికా వనం.. కబ్జాల పరం

హైదరాబాద్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ప్రారంభించిన మూలికా వనం(హెర్బల్ గార్డెన్)ను ఆక్రమించేందుకు కొందరు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ వనంలో పదుల సంఖ్యలోనే మొక్కలుండగా, వాటి సంరక్షణనూ మున్సిపల్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదే అదనుగా.. మూలికావనం ఇనుప కంచెను, బోర్డును ఇటీవల కొందరు తొలగించారు. కొంచెంకొంచెంగా ఆక్రమించేందుకు సమీపంలోని ప్రైవేటు పట్టాల హద్దులను పెంచుకుంటూ స్థలాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.కాలుష్య తీవ్రతను తగ్గించేందుకు..: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోనే జీహెచ్‌ఎంసీ డంపింగ్ యార్డ్ ఉండటంతో అందులో నుంచి విడుదలయ్యే కలుషిత వాయువుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రకృతి వనం పేరుతో గత ప్రభుత్వం నాలుగేళ్ల కిందట కాప్రా మండలంలోని సర్వే నంబర్లు 759, 974లలో 4.03 ఎకరాల్లో మూలికల మొక్కలు



పెంచాలని మున్సిపల్ అధికారులను ఆదేశించింది. స్థలం కేటాయింపు తర్వాత మున్సిపల్ అధికారులు కంచెలు ఏర్పాటుచేసుకున్నారు. అటవీశాఖ నుంచి ఔషధ మొక్కలు తీసుకుని నాటారు. మాజీ మంత్రి మల్లారెడ్డి హెర్బల్ పార్కును ప్రారంభించారు.

నిర్వహణ లోపం.. అక్రమార్కులకు వరం

కొద్దినెలలు మున్సిపల్ అధికారులు హడావుడి చేశారు. కొన్ని మొక్కలు తీసుకువచ్చి బాగానే సంరక్షించారు. కరోనా ప్రభావంతో పట్టించుకోవడం మానేశారు. కరోనా పూర్తిగా తొలగినా కొత్తగా మొక్కలు నాటలేదు. ఉన్నవాటి నిర్వహణా వదిలేశారు. హైదరాబాద్ బిట్స్ క్యాంపస్‌కు వెళ్లే మార్గంలో ఈ వనం ఉండటం, ఇక్కడ ఎకరా రూ.2కోట్ల వరకు పలుకుతుండటంతో కొందరు కబ్జాదారులు తెర వెనుక ఉండి సరిహద్దు కంచె, బోర్డును తీసేయించారు. ఇప్పుడీ ప్రాంతం మైదానంలా మారడంతో క్రికెట్, బ్యాడ్మింటన్ ఆడుతున్నారు. ఇనుప కంచెను, బోర్డును తొలగించినా అధికారులు ఇప్పటికీ పోలీసులకు ఫిర్యాదు ఇవ్వలేదు.

## ముంపు బాధితులగోడు వినరూ..?



సిరిసిల్ల : "వంద గ్రామాల్లోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తామంటే భూములు, బావులు, ఇళ్లు పోయినా అంగీకరించాం. భూమి విలువ కంటే తక్కువ పరిహారం చెల్లించినా ఓర్చుకున్నాం కానీ.. తమ ఇళ్లను స్వాధీనం చేసుకోకుండా.. బావులకు పరిహారం చెల్లించకుండా బతుకులతో ఆడుకుంటున్నార"ని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఊళ్లను స్వాధీనం చేసుకొని పునరావాసం కల్పించాలని వేడుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆయా ప్రాంతాలకు గంగాధర, నారాయణపూర్ జలాశయాలు ప్రధాన నీటి వనరుగా నిలిచాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఈ రెండింటినీ నింపి ఇక్కడి నుంచి జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు సాగునీటిని అందిస్తున్నారు. అయితే 0.3 టీఎంసీ సామర్థ్యం గల ఈ చెరువుల కట్టలను అభివృద్ధి చేయకుండా ఏళ్లుగా నీటిని నింపుతున్నారు. జులైలో భారీ వర్షాలకు జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని ఎగువ ప్రాంతాల నుంచి వెంకటాయపల్లి వాగుద్వారా వరదనీటి ఉద్ధృతితో నారాయణపూర్ చెరువు నిండుకుండలా మారి దిగువకు వరద పోటెత్తింది. నారాయణపూర్ చెరువు, గంగాధర ఎల్లమ్మ చెరువు కట్టకు గండ్లు పడగా భయానక వాతావరణం తలెత్తింది. ఇస్తారుపల్లి, నారాయణపూర్ ఎస్సీ కాలనీ వాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గంగాధరలోని పునరావాస కేంద్రానికి తరలివెళ్లారు.

ప్రభుత్వానికి నివేదించినా..

నారాయణపూర్, గంగాధర చెరువుల కింద 236 ఎకరాల వ్యవసాయ భూములతో పాటు బావులు, పైపులైన్లకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉండగా ఇటీవల మంగపేట రైతులకు వ్యవసాయ భూములకు సంబంధించి పరిహారం చెల్లించారు. ఎకరాకు రూ.20.25 లక్షల చొప్పున మంజూరు కావడంతో అక్కడ సమస్య తీరింది. ఇస్లాంపూర్ రెవెన్యూ పరిధిలోని ఆరుగురు రైతుల వ్యవసాయ భూములకు చెల్లించి, బావులకు చెల్లించకపోవడంతో వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నారాయణపూర్‌లో చెరువు కట్ట కింద ఉన్న భూములకు పరిహారం చెల్లించలేదు. మంగపేటలో 11 ఇళ్లు, నారాయణపూర్ చెరువు కట్ట కింద 32 ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని, గతంలో అధికారులు గుర్తించారు. ఆర్అండ్‌బీ, అటవీశాఖ అధికారులు కొలతలు తీసుకొని ప్రభుత్వానికి నివేదించగా బాధితులకు పరిహారం మంజూరు కాలేదు. చర్లపల్లి ఎన్, ఇస్తారుపల్లి గ్రామాల్లోనూ ముంపు సమస్యలతో ప్రజలు ఏటా ఇబ్బంది పడుతున్నారు. జనావాసాల్లోకి పాములు, తేళ్లు, ఇతర విషకీటకాలు వచ్చి ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇళ్ల గోడలు తడిసి ఎప్పుడు కూలుతాయోనని భయంతో గడుపుతున్నారు.

బావి, ఇంటికి మొండిచేయి

ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఇస్లాంపూర్‌లో నాకున్న మూడెకరాల్లో 33 గుంటల భూమితోపాటు వ్యవసాయ బావి కోల్పోయాను. భూమికి మాత్రమే పరిహారం చెల్లించి బావికి ఇవ్వలేదు. నాకు రావాల్సిన పరిహారం డబ్బులు రూ.6.81 లక్షలు మరో వ్యక్తికి అందించారు. ఇళ్లను స్వాధీనం చేసుకుని పరిహారం చెల్లింపులోనూ ఏళ్లుగా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

మడుపు తిరుపతిరెడ్డి, మంగపేట

సర్వే చేసి ఏడు నెలలు గడిచినా..

చెరువు కట్ట కింద 32 ఇళ్లను ముంపు కింద గుర్తించిన అధికారులు సర్వే చేసి ఏడు నెలలు గడిచింది. ఇంకా అటవీశాఖ, ఆర్అండ్‌బీ అధికారులు ఇళ్లకు కొలత వేయలేదు. కొన్నేళ్లుగా చెరువులు నింపుతుండగా ముంపు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నారాయణపూర్‌లో ఇంకా కొన్ని వ్యవసాయ భూములకు పరిహారం అందలేదు.బావు మల్లేశం, నారాయణపూర్

# పట్టుబడుతున్న కొత్త సరకు!

ఖమ్మం : ఇటీవల జిల్లా ఆబ్కారీ టాస్క్‌ఫోర్స్ బృందం ఖమ్మం నగరంలో ఓ ముఠాను పట్టుకుంటే 13 కిలోల గంజాయి దొరికింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల్లో 30.5 కిలోలు పట్టుబడింది. అయితే ఇదంతా కొత్త సరకు కావడం గమనార్హం. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు(ఏఓబీ)ల మధ్య అటవీ ప్రాంతంలో తాజా గంజాయి పంట అమ్మకానికి సిద్ధంగా ఉందనే సమాచారం చేరడంతో స్మగ్లర్లు, స్థానిక గంజాయి ముఠాలు పరుగులు పెడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రైవేటు పార్సిల్ సర్వీసుల్లో తరలింపు

ఆబ్కారీశాఖకు దొరక్కుండా ముఠాలు కొత్తమార్గాల్లో సరకు రవాణా చేస్తున్నాయి. భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సుల్లో రవాణా జరుగుతోందనే సమాచారం మేరకు వాటిని తనిఖీ బృందాలు క్షుణ్ణంగా శోధిస్తున్నాయి. ఇది పసిగట్టిన ముఠాలు భద్రాచలం నుంచి ఖమ్మం బస్సులు ఎక్కి.. ఇక్కడ దిగి వేరే బస్సుల్లో హైదరాబాద్ వెళ్తున్నారు. ఇతర రాష్ట్రాలకు రైళ్లలో చేరుకుంటున్నారు. ఇది గమనించిన తనిఖీ బృందాలు భద్రాచలం, ఖమ్మం బస్సులను పరిశీలించగా నాలుగు రోజుల వ్యవధిలో 43 కిలోల సరకు దొరికింది. నిందితుల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం చాలా సరకు కొరియర్, ఆర్టీసీ కార్గో, ప్రైవేట్ పార్సిల్ సర్వీసుల్లో చేరవేస్తున్నట్టు తేలింది.

ఆధునిక పరిజ్ఞానం వినియోగం

గంజాయి ముఠాలకు కచ్చితమైన సరకు సమాచారం అందుతోంది. ఇతర రాష్ట్రాల్లోని వారైతే ఎలా చేరుకోవాలనే రూట్‌మ్యాప్‌లు ఉంటున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఓ అంతర్రాష్ట్ర ముఠాను ఖమ్మంలో పట్టుకొంది. వీరి వద్దనున్న సమాచారం చూసి తనిఖీ బృందాలు విస్తుపోయాయి. మహారాష్ట్ర నుంచి ఒడిశాలోని గంజాయి సరకు లభించే చోటు వరకు ఎలా చేరుకోవాలో రూట్‌మ్యాచ్ నిందితుల



సెల్‌ఫోన్లలో గమనించారు. ముఠా సభ్యులు మహారాష్ట్రలోని బుల్దాన్ నుంచి బయలుదేరి నిజామాబాద్ చేరుకున్నారు. అక్కడి నుంచి వరంగల్ మీదుగా సీలేరు, శబరి నది ఒడ్డుకు చేరుకుంటే సరఫరాదారులు వారిని తెప్పలో నది దాటించి ఒడిశా అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి 30 కిలోల సరకు ముట్టజెప్పారు. విస్తారంగా పండించిన గంజాయి పంట ఫొటోలు, వీడియోలను ముఠా సభ్యులు సెల్‌ఫోన్ల ద్వారా ఇతరులకు పంపినట్టు సమాచారం. భద్రాచలం-హైదరాబాద్ బస్సులో ఎక్కకుండా భద్రాచలం-ఖమ్మం బస్సు ఎక్కారు. వీరిలో ముగ్గురు పట్టుబడగా మిగిలిన ఇద్దరు తప్పించుకున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పుడక్కడ భారీగా గంజాయి పంట పండింది. తాజా సరకు రండీ అనే సందేశాలు ముఠాలకు చేరిన నేపథ్యంలోనే స్మగ్లర్లు ఒడిశా బాట పట్టినట్టు ఆబ్కారీ శాఖలో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఆబ్కారీ అధికారి నాగేంద్రరెడ్డి.. సీఐ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి దాడులకు వ్యూహరచన చేశారు. ఇప్పుడు వస్తున్న గంజాయి వరదను పరిమిత సంఖ్యలో ఉన్న ఆబ్కారీ బృందం ఎంతవరకు అడ్డుకుంటుందో చూడాలి. ఇప్పుడున్న నేరాలకు అనుగుణంగా ఆబ్కారీ శాఖను ఆధునీకీకరించకపోతే సమస్యకు పరిష్కారం దొరకదనే వాదనలు వినిపిస్తున్నాయి.

# వాళ్లంతే.. తీరు మారదంతే..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్.. లేఅవుట్ లేని ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేశారని జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదులు అందాయి. సదరు అధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. సుమారు మూడు నెలలుగా అంతర్గత విచారణ పేరిట కాలయాపన తప్ప అతడిపై చర్యలు తీసుకోకపోవటం గమనార్హం.

భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి.. సబ్ రిజిస్ట్రార్ సంతకం ఫోర్జరీ చేయటం చర్చనీయాంశమైంది. సదరు ఉద్యోగి ఫోర్జరీ సంతకంతో బ్యాంకు నుంచి రూ.35వేలు తీసినట్లు తేలటంతో సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఖమ్మం జిల్లాలోని ఓ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండేళ్లలో ఇద్దరు అధికారులు బదిలీ అయ్యారు. 2023 నవంబర్‌లో సరైన డాక్యుమెంట్, లేఅవుట్ లేని వెంచర్లకు రిజిస్ట్రేషన్ చేశారని ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ ఆరోపణలు ఎదుర్కొన్నారు.రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ లేని సమయంలో ఇన్‌ఛార్జి అధికారి ముడుపులు తీసుకుని తతంగం నడిపినట్లు తేలింది. ఆతర్వాత ఇద్దరి అధికారుల మధ్య విభేదాలు రావటం, ఫిర్యాదు అందటంతో సదరు అధికారిపై సస్పెన్షన్ వేటు పడింది.

ఈటీవీ – ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం రిజిస్ట్రేషన్ల శాఖలో అవినీతి జాడ్యం వదలటం లేదు. అక్రమ వెంచర్లలోనూ రిజిస్ట్రేషన్లకు పచ్చజెండా ఊపటం, అనుమతులకు విరుద్ధంగా భవంతులు నిర్మిస్తున్నా ముడుపులకు కక్కుర్తిపడటం సర్వసాధారణమయ్యాయి. శాఖాపరంగా అంతర్గత విచారణ పేరిట విచారణ జరిపి నామమాత్రపు చర్యలకు పరిమితమవటంతో అధికారులు, సిబ్బంది తీరు మారటం లేదు. రిజిస్ట్రేషన్ల శాఖలో సుమారు పదేళ్లుగా బదిలీల ఊసే లేకపోవటంతో కొంతమంది సిబ్బంది వసూళ్ల బాగోతానికి అడ్డుకట్ట పడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాల వారీగా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చటంలో హైదరాబాద్ తర్వాత వరంగల్, కరీంనగర్ జిల్లాలతో ఖమ్మం రిజిస్ట్రేషన్ల శాఖ పోటీపడుతోంది. అవినీతిలోనూ అంతకన్నా ఎక్కువ అప్రతిష్ఠ మూటగట్టుకుంటోంది.

మధ్యవర్తులు, సిబ్బంది కనుసన్నల్లో..

ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, కూసుమంచి, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, బూర్గంపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రతినెలా సర్కారుకు సుమారు రూ.20 కోట్ల ఆదాయం సమకూరుతుంది.అదేస్థాయిలో అవినీతి జరుగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. మధ్యవర్తులు, సిబ్బంది కనుసన్నల్లోనే ఈ తతంగమంతా సాగుతుంది. లేఅవుట్లు లేకపోతే ప్లాట్లు చేయకూడదనే నిబంధనను చాలా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పాటించటం లేదని, రూ.లక్షలు చేతులు మారుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. నగర, పురపాలికల్లో నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తున్నా రిజిస్ట్రేషన్లు సాఫీగా సాగుతున్నాయి. నజరానాగా అధికారులు, సిబ్బందికి ముడుపులు అందుతున్నాయనే వాదనలున్నాయి.

అంతర్గత విచారణతో కాలయాపన..!

కొన్నిచోట్ల ఏళ్ల తరబడి తిష్ఠవేసిన అధికారులు, సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇంకొన్నిచోట్ల రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్లు లేకపోవటంతో సిబ్బందే పెత్తనం చెలాయిస్తున్నారు. గతేడాది చివర్లో అనేక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. కొందరిపై ఆరోపణలు నిజమని తేలడంతో సస్పెండ్ లేదా బదిలీ అయ్యారు. మిగతావారిపై విచారణ ఇప్పటికీ కొలిక్కిరాలేదు.సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బందిపై ఆరోపణలపై విచారణ జరుపుతున్నాం. వాస్తవమని తేలితే చర్యలు తీసుకుంటున్నాం. కొందరిపై వేటు వేశాం. మరికొందరిని బదిలీ చేశాం. కొన్నిచోట్ల అధికారులపై ఫిర్యాదులు అందగా అంతర్గతంగా విచారణ సాగుతోంది.

# ఆదాయ మార్గాలపై నిర్లక్ష్యమేల?




కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థతోపాటు పురపాలికల్లో ఆదాయ మార్గాలు పెంచుకోవడానికి దుకాణ సముదాయాలు నిర్మించారు. వేలంపాట నిర్వహించి ప్రతి నెలా అద్దె వసూలు చేసుకోవడం ద్వారా రూ.లక్షల్లో రెవెన్యూ జమ అవుతోంది. ఈ దుకాణాలన్నీ రద్దీ ప్రాంతాల్లోనే ఉన్నాయి. అలాంటి దుకాణాల ద్వారా ఆదాయం ఎప్పటికప్పుడూ పెంచుకునేలా చర్యలు తీసుకోవాల్సి ఉండగా పట్టనట్లుగా ఉంటున్నారు. నగరపాలిక పరిధిలో ఏళ్ల తరబడి అలాగే ఉండటం, బినామీల పేరు మీద వాటిని అప్పగించిన దుకాణాలు కూడా ఉన్నాయి. కొందరు అధిక మొత్తానికి ఇతరులకు అద్దెకు ఇచ్చిన వారున్నట్లుగా చెబుతున్నారు. మున్సిపల్ నిబంధనల ప్రకారం 30 ఏళ్లు దాటిన దుకాణాల సముదాయాలకు మళ్లీ ఓపెన్ యాక్షన్ నిర్వహించాల్సి ఉండగా, ఇప్పటికీ అలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రతి మూడున్నర ఏళ్లకు ఒకసారి అద్దెపై 33.3 శాతం పెంచాల్సి ఉంటుంది. గడువు దాటిన మడిగెలను గుర్తించడంలో రెవెన్యూ అధికారులు మాత్రం నిర్లక్ష్యాన్ని వీడటం లేదు.

161 దుకాణాలు.. రూ.40 లక్షలు

నగరపాలక సంస్థకు మొత్తం 161 దుకాణ సముదాయాలు ఉన్నాయి. ఏటా అద్దె ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరుతోంది. వీటిలో కార్యాలయం పక్కన ఉన్న రాజీవ్‌గాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌లో జీం1లో 50 దుకాణాలు ఉన్నాయి. వీటిలో 26 దుకాణాలు మాత్రమే అద్దెకిచ్చారు. మిగతావి కార్యాలయ అవసరాలకు, మెప్మా, ఈసేవ కార్యాలయం, గుత్తేదారుల సంక్షేమ సంఘానికి కేటాయించారు. పాత యూనాని ఆసుపత్రి(పాసుపోర్టు కార్యాలయం) కింది అంతస్తులో మొత్తం 8 ఉండగా అయిదు అద్దెకిచ్చారు. మూడు ఖాళీగా ఉన్నాయి. మున్సిపల్ అతిథిగృహం మొదటి అంతస్తులో 26 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. ప్రధాన కూరగాయల మార్కెట్ ప్రాంతంలో 32 దుకాణాలు ఉన్నాయి. టవర్ సర్కిల్ రోడ్డులో, టెలిఫోన్ భవన్ వైపు మొత్తం 45 దుకాణాలు ఉన్నాయి. వీటిని చిరు వ్యాపారులకు కేటాయించారు.

చర్యలు శూన్యం సొంత ఆదాయం పెంపుకోసం పాటు పడాల్సిన నగరపాలక అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారు. ముప్పై ఏళ్లు దాటిన సముదాయాలు, ఖాళీగా ఉన్న దుకాణాలతోపాటు కొత్తగా స్మార్ట్‌సిటీలో భాగంగా నిర్మించిన షెడ్లు అప్పగించాల్సి ఉండగా, పట్టించుకోవడం లేదు. కొన్ని దుకాణాలకు ఏళ్ల తరబడి అద్దెలు బకాయిలు ఉన్నాయి. వీటన్నింటి ద్వారా బల్దియా ఆదాయం రెండు రెట్లు పెంచుకునే వీలుంది. ఈ విషయంలో అధికార యంత్రాంగం ఎలా వ్యవహరిస్తుందో చూడాల్సిందే.

దారి తప్పిన పునరావాసం

రోడ్లపై క్రయ, విక్రయాలు జరపకుండా కొన్నేళ్ల కిందట మార్కెట్ ప్రాంతంలో చిరు వ్యాపారులకు చిన్న, చిన్న గదులు నిర్మించి అద్దెకిచ్చారు. ఇందులో అసలైన లబ్ధిదారు ఎక్కడ ఉన్నారో తెలియకుండా మారగా వారిలో కొందరు తిరిగి మార్కెట్ ధరకు అద్దెకు ఇచ్చినట్లు బహిరంగంగానే చెబుతున్నారు. ఆర్థికంగా చేయూతనివ్వడానికి వీటిని అప్పగించగా ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారు. వీటికి అతి తక్కువగా అద్దె వసూలు చేస్తుండటం గమనార్హం.

ఆదేశాలు ఇచ్చాం– శ్రీనివాస్, కమిషనర్, బల్దియా, కరీంనగర్

మున్సిపల్ దుకాణాల గడువు ముగిసిన వాటికి సంబంధించినవి గుర్తించాం. రెండు, మూడు రోజుల్లో వేలం పాట నోటిఫికేషన్ ఇస్తాం.

# కరీంనగర్ భూ దందాల నేతలు విదేశాలకు?

కరీంనగర్ : కరీంనగర్‌లో భూకబ్జాలు, బెదిరింపులు, వేధింపులకు పాల్పడిన నాయకుల వరుస అరెస్టులు ఈ దందాల్లో పాలుపంచుకున్న ఇతర నేతలను వణికిస్తున్నాయి.. ఈ క్రమంలోనే కొంతమంది నేతలు విదేశాలకు వెళ్లినట్లు, మరికొందరు ఇతర రాష్ట్రాలకు వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది.. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు బాధితులు పెద్దఎత్తున ఫిర్యాదులు చేయడం, ఆయన నేతృత్వంలో పోలీసులు కఠిన చర్యలు చేపట్టడంతో కొన్ని రోజులు కనిపించకుండా పోతే అరెస్టుల నుంచి తప్పించుకోవచ్చని ఇలా చేసినట్లు తెలుస్తోంది.. ఇప్పటికే పోలీసులకు 600లకు పైగా ఫిర్యాదులు రాగా.. పక్కా వివరాలు సేకరించి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులు, నాయకులను విచారిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు కార్పొరేటర్లు, ఇద్దరు మహిళా కార్పొరేటర్ల భర్తలతోపాటు మరో ఆరుగురు నాయకులను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. తమ వంతు కూడా వస్తుందేమోనని ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.ఇదే సమయంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు నాయకులు, మరో నాయకుడితో కలిసి నాలుగు రోజుల కిందట విదేశాలకు వెళ్లినట్లు సమాచారం. విహార యాత్ర పేరుతో వారు వెళ్లారని, అసలు కారణం కేసులు, అరెస్టుల భయమేనని ప్రచారం జరుగుతోంది. వీరితోపాటు మరికొందరు నాయకులు విహార యాత్రల పేరిట ఇతర



రాష్ట్రాలకు వెళ్తున్నారు. విచారణ ప్రారంభించిన కొత్తల్లోనే ముగ్గురు నాయకులు ఇలాగే ఇతర రాష్ట్రాలకు వెళ్లి తమపై ఇంకా ఎలాంటి చర్యల ఆనవాళ్లు కనిపించకపోవడంతో తిరిగి వచ్చారు. బాధితుల ఫిర్యాదులపై పోలీసులు లోతుగా విచారణ చేస్తుండగా పలువురు ముఖ్య నాయకుల పేర్లు సైతం త్వరలో బయట పడే అవకాశం ఉన్నట్లు సమాచారం. రెండ్రోజుల్లో మరో ఇద్దరు నాయకులను పోలీసులు అరెస్టు చేయనున్నట్లు తెలిసింది.

# సాగుభూమి.. చెరువు.. ఏదైనా వెంచరే.. విక్రయాల జాతరే



సాగుభూమి.. చెరువు.. ఏదైనా వెంచరే.. విక్రయాల జాతరే

హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేసి కొందరు అక్రమార్కులు వేలాది మందిని ముంచేస్తున్నారు. హెచ్‌ఎండీఏ అనుమతి తీసుకున్నామంటూ నమ్మించి స్థలాలు విక్రయిస్తున్నారు. ఇళ్ల నిర్మాణ అనుమతికి వెళితే.. ఆ వెంచర్‌కు అనుమతే ఇవ్వలేదని అధికారులు చెబుతుండటంతో కొనుగోలుదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కొన్ని చోట్ల చెరువు స్థలాలను ఆక్రమించి వెంచర్లు వేసి నిర్మాణాలతో రూ.కోట్లు దండుకుంటున్నారు. గ్రేటర్ పరిధిలోని రెండు జిల్లాల్లో ఈ మోసం అధికంగా జరుగుతోంది. ఈ వ్యవహారాన్ని పరిశీలించగా అక్రమాల వరుస వెలుగులోకి వచ్చింది.

నిబంధన ప్రకారం.. లేఅవుట్‌కు అనుమతించాలంటే ప్రైవేటు భూమి ఉండాలి. అదీ రోడ్లు, మౌలిక సదుపాయాలతో. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అనధికారికంగా రెండువేలకు పైగా చిన్నాపెద్ద వెంచర్లు ఉన్నాయి. సాగుభూమిని నాలా కన్వర్షన్ చేయకుండా, అక్రమ లేఅవుట్ వేస్తున్నారు. గతంలో మరో లేఅవుట్‌కు హెచ్‌ఎండీఏ ఇచ్చిన అనుమతి పత్రాలను తాము వేస్తున్న ప్రస్తుత వెంచర్‌కు ఇచ్చినట్లు మారుస్తున్నారు. ఆ వివరాలతో బోర్డులు పెట్టి ప్లాట్లు విక్రయిస్తూ రూ.కోట్లలో సొమ్ము చేసుకుంటున్నారు.

చెరువు స్థలంలోనే వెంచర్లు మొయినాబాద్ మండల పరిధి.. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కనే పీరంచెరువు ఉంది. ఒకప్పుడు 34.20ఎకరాల్లో ఉండేది. క్రమంగా ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి విక్రయించారు. ప్రస్తుతం శిఖం, బఫర్ జోన్లలోనూ నిర్మాణాలు చేపట్టారు. అడ్డుకోవాల్సిన ఇరిగేషన్, ఇతర అధికారులు.. స్థిరాస్తి వ్యాపారుల నుంచి భారీగా ఆమ్యామ్యాలతో ఎన్‌వోసీలు ఇస్తున్నారు. ఇప్పటికే రూ.300 కోట్ల స్థలం కబ్జాకు గురికాగా.. మరో మూడెకరాల్లో లేఅవుట్ వేసి అపార్టుమెంట్లు నిర్మిస్తున్నారు. పెబెల్ సిటీ మార్గంలో ఇలాగే వెంచర్లతో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి.

శివార్లలోనూ అదే పరిస్థితి

గండిపేట మండలం బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ లేఅవుట్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. సిఖిందర్‌గూడ, కిస్మత్‌పూర్, బండ్లగూడజాగీర్, హైదర్షాకోట్, పీరంచెరువు ప్రాంతాల్లో సాగు భూములను చదునుచేసి రోడ్లు వేస్తున్నారు. ప్లాట్లుగా విభజించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. కార్పొరేషన్ యంత్రాంగం, రెవెన్యూ అధికారులు పట్టనట్లుగా ఉండటంతో.. స్థిరాస్తి వ్యాపారులు వేసిన లేఅవుట్లలో గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, అపార్టుమెంట్లు వెలిశాయి. ఈ ప్రాంతంలో బహిరంగ మార్కెట్ ప్రకారం ఎకరా రూ.20 – 30 కోట్లు పలుకుతోంది.

ఇరుకు రోడ్లలోనూ..కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్, గంధంగూడ, పీరంచెరువు, కిస్మత్‌పూర్, బండ్లగూడజాగీర్ ప్రాంతాల్లో 30 ఫీట్ల రహదారులపై బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. హైదర్షాకోట్-గంధంగూడ వెళ్లే మార్గంలో 30 ఫీట్ల రోడ్డు మాత్రమే ఉండగా.. ఏకంగా సెల్లార్, అయిదంతస్తుల భవన నిర్మాణం జరుగుతోంది. స్థానికులు వ్యతిరేకిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ఇరుకు రోడ్లను వంద ఫీట్లకు విస్తరించాలన్న ప్రతిపాదన ఉంది. ముందుచూపు లేకుండా ఇక్కడ కమర్షియల్, బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయం చుట్టుపక్కల రెండు ఎకరాల నుంచి పది ఎకరాల్లో అక్రమ లేఅవుట్లు పుట్టుకొస్తున్నాయి. కొంత సర్కారు భూమిని అక్రమించి మరీ వెంచర్లు వేసి అమ్మేస్తున్నారు.

నగరం చుట్టుపక్కల అక్రమ లేఅవుట్లు: 2000

అందులో చిన్నాపెద్దా ప్లాట్లు దాదాపు: 2 లక్షలు

అనుమతులు లేని, అక్రమ నిర్మాణాలు: 1.5లక్షలపైనే

హెచ్‌ఎండీఏ గుర్తించినవి..: 600

ఇందులో అపార్టుమెంట్లు : 200

# సాదాబైనామా.. పరిష్కారం కలేనా?

సిరిసిల్ల : చిన్న, సన్నకారు రైతులు సాదాబైనామా దరఖాస్తుల ద్వారా తమ భూములకు హక్కు లభిస్తుందని ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. తెల్ల కాగితాలు, స్టాంప్ పేపర్లపై రాయించుకుని భూములు కొనుగోలు చేసుకున్న రైతులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సాదాబైనామా కోసం దరఖాస్తులు చేసుకున్నారు. మీ సేవ కేంద్రాల్లో ఎలాంటి రిజిస్ట్రేషన్ రుసుం లేకుండా కేవలం యూజర్ ఛార్జీలు మాత్రమే తీసుకొని దరఖాస్తులను స్వీకరించారు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు భారీగానే ఆదాయం రాగా, మీ సేవ కేంద్రాల నిర్వాహకులు కొందరు రహస్యంగా దస్తావేజుల విక్రయాలు జరిపి జేబులు నింపుకున్నారు. కానీ నేటికి మూడేళ్లు గడిచినా దరఖాస్తులు మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. ఇదిలా ఉండగా గడిచిన మూడేళ్ల కాలంలో పోడు భూముల దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారికి ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసింది. అదే విధంగా సాదాబైనామా దరఖాస్తులను ఇప్పటికైనా కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఎన్నో ఆశలతో ఉన్నారు. జిల్లాలోని 13 మండలాల్లో 15,056 మంది దరఖాస్తు చేసుకున్నారు.

2020లో దరఖాస్తుల స్వీకరణ

అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి సాదాబైనామాకు సంబంధించిన దరఖాస్తులను 2020 అక్టోబర్ 19 నుంచి అదే ఏడాది నవంబర్ 11 లోపు చేసుకోవాలని ప్రకటించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మీ



సేవా కేంద్రాల్లో రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో భాగంగానే జిల్లాలోని 13 మండలాల ద్వారా 15,056 మంది రైతులు దరఖాస్తు చేసుకొన్నారు. అప్పట్లో మీ సేవా కేంద్రాల నిర్వాహకులు కొందరు దీనిని ఆసరాగా తీసుకొని ఒక్కో దరఖాస్తుకు రూ.45 కాకుండా అవకాశాన్ని బట్టి రూ.150 నుంచి రూ.200 వరకు వసూలు చేశారు. అలాగే రూ.10 నుంచి రూ. 100 దస్తావేజులను పాత సంవత్సరానికి అనుగుణంగా తెచ్చుకోవడం కోసం రైతులు అధికంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వచ్చింది. అయినప్పటికీ వీటికి పరిష్కారం లభించలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ ద్వారా ఉత్పన్నమైన భూ సమస్యలపై అధ్యయనం చేసి అందులో సాదాబైనామాకు కూడా అవకాశం కల్పించినట్లయితే దరఖాస్తుదారులందరికీ న్యాయం జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఈ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు– ఎన్.ఖీమ్యానాయక్, జిల్లా అదనపు కలెక్టర్ సాదాబైనామాకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఏమైనా ఆదేశాలు వస్తే జిల్లాలో సాదాబైనామా కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

# కాల్వలు మాయం..!

నకిరేకల్ : ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ, డిస్ట్రిబ్యూటరీల వెంట ఉన్న స్థలాలే కాకుండా పొలాలకు నీరందించేందుకు నిర్మించిన పంటకాల్వలు (మైనర్లు) కూడా ఆక్రమణలతో మాయమవుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన మైనర్ల నిర్వహణకు నేటికి నిధులు కేటాయించకపోవడం, డిస్ట్రిబ్యూటరీల నుంచి పూర్తిస్థాయిలో వీటికి నీటి సరఫరా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో మైనర్ కాల్వలను ఎక్కడికక్కడ ఆక్రమించేస్తున్నారు. భవిష్యత్తులో ఏఎమ్మార్పీకి పూర్తిస్థాయిలో నీటి విడుదల కొనసాగితే పంటపొలాల వద్దకు నీటిని తీసుకొచ్చేందుకు ఈ కాల్వలు కీలకంగా మారనున్నాయి. ఇప్పుడు ఆక్రమణ చెరలో ఉన్న ఈ కాల్వలను కాపాడకుంటే రైతుల మధ్య తగాదాలు జరిగి శాంతిభద్రతల సమస్యలు రానున్నాయి.

వట్టిపోయి.. అన్యాక్రాంతమై..పీఏ పల్లి మండలంలో మొదలయ్యే ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ 135 కిలోమీటర్లు ప్రయాణించి నకిరేకల్ వద్ద మూసీ జలాశయంలో కలుస్తుంది. దీనికి 55 డిస్ట్రిబ్యూటరీ కాల్వలు, 250 మైనర్ కాల్వలు ఉన్నాయి. ప్రధాన కాల్వకు చివరి ప్రాంతం కావడంతో ఇక్కడి మైనర్లు నీరు అందక వట్టిపోయాయి. నీరు రాని కాల్వలను సమీపంలోని వారు ధ్వంసం చేసి తమ భూముల్లో కలిపేసుకుంటున్నారు.నకిరేకల్ నియోజకవర్గంలో ఏఎమ్మార్పీ ద్వారా 30 వేల ఎకరాలకు నీరందించాలనే లక్ష్యంతో..2005లో రూ.50 కోట్లతో 15 డిస్ట్రిబ్యూటరీలు, 50 మైనర్ కాల్వలు నిర్మించారు. నాడు కొన్ని మైనర్ల నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు. డి-40కి సంబంధించిన ఎల్.ఆర్ మైనర్ దాదాపు మూడు కిలోమీటర్ల పొడవునా ఆనవాళ్లు లేకుండా ఆక్రమణలకు గురైంది. మండలంలోనే పెద్దదైనా, చారిత్రక చందుపట్ల చెరువును ఏఎమ్మార్పీ నీటితో నింపేందుకు నిర్మించి ఎల్.ఆర్ కాల్వ పూడ్చివేతలు నేటికి కొనసాగుతున్నాయి.

సమాచారం సేకరించి చర్యలు చేపడతాం

పాండునాయక్, ఏఈ, నీటిపారుదల శాఖ, నకిరేకల్‌తమ శాఖ డివిజన్ల మార్పుల వల్ల ప్రస్తుతం పూర్తి వివరాలు అందుబా టులో లేవు. మైనర్లకు సంబంధించి నాడు సేకరించిన భూముల వివరాలను భూసేకరణ విభాగం నుంచి తెప్పించి హద్దులు ఏర్పాటు చేస్తాం. ఆక్రమణల నుంచి మైనర్ కాల్వలను కాపాడేందుకు చర్యలు చేపడతాం.

# వానరాలు పోలే.. వనాలే పోయాయి!

జగిత్యాల : పల్లెలు, పట్టణాల్లో వానరాల దాడులతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటి కారణంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వీటిని నిలవరించేందుకు జిల్లాలో 57 ప్రాంతాలను గుర్తించి మంకీ ఫుడ్ కోర్టు(కోతుల ఆహార ప్రాంగణాలు) ఏర్పాటు చేశారు. వీటిలో వివిధ రకాల పండ్లనిచ్చే మొక్కలను అధికారులు, పాలకులు ఆర్భాటంగా నాటించారు. అంతేకాకుండా చుట్టూ కంచెలను ఏర్పాటు చేసి, రెండుమూడేళ్లు సంరక్షణ చేపట్టినా, ప్రస్తుతం పూర్తిగా విస్మరించారు. పిచ్చిమొక్కలతోపాటు మొక్కలు కనిపించకుండా పోయాయి.

చేతులెత్తేసిన పంచాయతీలు

గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కోతుల ఆహార ప్రాంగణాలు ఏర్పాటు చేసి మండల స్థాయి అధికారులకు సంరక్షణ బాధ్యతలు అప్పగించారు. పంచాయతీ పాలకవర్గాలు, రెవెన్యూ అధికారులు సూచించిన స్థలాల్లో ఇప్ప, కరక్కాయ, జామ, ఉసిరి, మారేడు, సీతాఫలం, నేరేడుతోపాటు వివిధ రకాల మొక్కలను నాటారు. గ్రామీణాభివృద్ధి శాఖ కొంత కాలం నిర్వహణ బాధ్యత తీసుకుని ఆ తరువాత పంచాయతీలకు అప్పగించారు. పాలక వర్గాలు, అధికారులు పట్టించుకోకపోవడంతో మొక్కల ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. కొద్దిపాటి మొక్కలు మిగిలి ఉన్న గ్రామాల్లోనైనా సంరక్షణ చర్యలు చేపట్టి కోతుల ఇబ్బందులు తొలగించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.






## కాంగ్రెస్‌లో చేరిన హైదరాబాద్ మేయర్.. సోదరుడు కూడా

హైదరాబాద్: లోక్ సభ ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జీ దీపాదాస్ మున్షీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. విజయలక్ష్మికి సీఎం రేవంత్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. విజయలక్ష్మితోపాటు ఆమె సోదరుడు వెంకట్ కూడా పార్టీలో చేరారు. ఇటీవల తాము బీఆర్ఎస్ పార్టీని వీడమని వెంకట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ వెంటనే సోదరితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, సీనియర్ నేత కే కేశవరావు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారు. బీఆర్ఎస్ స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్య కూడా కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం ఉంది.

ఇప్పటికే ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. కడియం శ్రీహరి పార్టీలో చేరికతో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 66కి చేరుతుంది. మిగతా నేతలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు క్యూ కడుతున్నారు.

## పీవీకి భారతరత్న ప్రదానం.. స్వీకరించిన కుమారుడు

దిల్లీ: దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రదానోత్సవం శనివారం నిర్వహించారు. దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రథమ మహిళ ద్రౌపదీ ముర్ము వీటిని ప్రదానం చేశారు. దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు తరఫున ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు ఈ పురస్కారాన్ని స్వీకరించారు. కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, జైశంకర్, కిషన్ రెడ్డి, భాజపా జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తదితరులు హాజరయ్యారు. పలు రంగాల్లో దేశానికి సేవలందించిన ఐదుగురు ప్రముఖులకు ఈ ఏడాది మూడు విడతల్లో 'భారతరత్న' ప్రకటించిన సంగతి తెలిసిందే. బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకుర్, భాజపా అగ్రనేత ఎల్.కె.ఆడ్వాణీ, మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చౌదరీ చరణ్‌సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌ను ఈ అత్యున్నత పురస్కారంతో గౌరవించారు. ఇందులో నలుగురికి మరణానంతరం ఈ అవార్డు లభించగా.. నేడు వారి కుటుంబసభ్యులకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. కర్పూరీ ఠాకుర్ తరఫున ఆయన కుమారుడు రామ్‌నాథ్, చౌదరీ చరణ్ సింగ్ తరఫున ఆయన మనవుడు జయంత్ సింగ్, స్వామినాథన్ తరఫున అవార్డును కుమార్తె నిత్యా రావు స్వీకరించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఆడ్వాణీ ఇంటికెళ్లి 'భారతరత్న' ప్రదానం చేయనున్నారు.

## బీజేపీ గేట్లు తెరిస్తే 48 గంటల్లో కాంగ్రెస్ సర్కార్ కూలుతుంది: మహేశ్వర రెడ్డి




హైదరాబాద్: తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర రెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. బీజేపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని కోమటిరెడ్డి కామెంట్స్ చేసిన సంగతి తెలిసిందే. ఆ వ్యాఖ్యలపై మహేశ్వర రెడ్డి స్పందించారు. ఒక్క బీజేపీ ఎమ్మెల్యేను టచ్ చేస్తే తెలంగాణ రాష్ట్రంలో 48 గంటల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. బీజేపీ హైకమాండ్‌తో తెలంగాణ మంత్రులు టచ్‌లో ఉన్నారని మహేశ్వర రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సహా ఐదుగురు మంత్రులు సంప్రదింపులు జరిపారని వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలతో సీఎం రేవంత్ రెడ్డికి నిద్ర కూడా పట్టడం లేదన్నారు.

**కోమటిరెడ్డి బ్రదర్ టచ్‌లో ఉన్నాడా..? :** కాంగ్రెస్ పార్టీతో 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారనే మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలను మహేశ్వర రెడ్డి ఖండించారు. కోమటిరెడ్డి తమ్ముడు రాజగోపాల్ రెడ్డి టచ్‌లో ఉన్నాడో లేడో తెలుసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ చేత ఎందుకు విచారించడం లేదని మహేశ్వర రెడ్డి నిలదీశారు. రంజిత్ రెడ్డి భూములపై ఆరోపణలు చేశారు.. తర్వాత పార్టీలో చేర్చుకుని పక్కన కూర్చొబెట్టుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. టెలిఫోన్ యాక్ట్ కేంద్ర ప్రభుత్వానిది అయినందున ఆ కేసు సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

**48 గంటలు :** బీజేపీ ఎమ్మెల్యేల గురించి మాట్లాడే స్థాయి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లేదని మహేశ్వర రెడ్డి స్పష్టం చేశారు. భువనగిరి ఎంపీ సీటును వెంకట్ రెడ్డి గెలిపించుకోవాలని సవాల్ విసిరారు. చేరికలకు సంబంధించి బీజేపీ గేట్లు తీస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 48 గంటలు కూడా ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ ఏక్‌నాథ్ షిండే పాత్ర పోషించడానికి చాలా మంది నేతలు ఉన్నారని హాట్ కామెంట్స్ చేశారు. రాజీనామా చేసిన తర్వాత ఈటల రాజేందర్ బీజేపీలో చేరారని మహేశ్వర రెడ్డి స్పష్టం చేశారు.

**కొత్తగా ఆర్ ట్యాక్స్ :** తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఆర్ టాక్స్ వసూల్ చేస్తున్నారని మహేశ్వర రెడ్డి ఆరోపించారు.

ఆర్ అంటే రేవంత్, రాహుల్, రాజీవ్.. ఇందులో ఏ పేరుతో ట్యాక్స్ వసూల్ చేస్తున్నారో మాత్రం తెలియదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు రూ.1500 కోట్లు హైకమాండ్‌కు పంపించారని వివరించారు. మరో రూ.500 కోట్లు పంపించాల్సి ఉందని గుర్తుచేశారు.

## బీఆర్ఎస్‌కు మరో షాక్.. నెగ్గిన అవిశ్వాసం..



తెలంగాణలో బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఓ వైపు సీనియర్లు పార్టీని వీడుతుంటే.. మరోవైపు స్థానిక సంస్థల్లో ఆ పార్టీ మరింత బలహీనపడుతుంది. తాజాగా కామారెడ్డి బీఆర్ఎస్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో ఆమె ఛైర్ పర్సన్ పదవి కోల్పోయారు. కామారెడ్డి కొత్త మున్సిపల్ ఛైర్ పర్సన్‌గా కాంగ్రెస్ కౌన్సిలర్ గడ్డం ఇందుప్రియ ఎన్నికయ్యారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ జాహ్నవిపై సొంత పార్టీ కౌన్సిలర్లే తిరుగుబాటు చేశారు. అవిశ్వాసానికి పరోక్షంగా 9 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు సహకరించారు. మొత్తం 49 మంది కౌన్సిలర్లకు గానూ, కాంగ్రెస్‌కు 27, టీఆర్ఎస్‌కు 16, బీజేపీకి ఆరుగురు ఉన్నారు.

**బీఆర్ఎస్ కౌన్సిలర్ల మద్దతు...** అవిశ్వాస తీర్మానం సమయంలో కోరం సరిపోక పోవడంతో కాంగ్రెస్ కు అనుకూలంగా 9మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు హాజరయ్యారు. బీఆర్ఎస్‌పై అసంతృప్తితో ఉన్న ఈ 9మంది కౌన్సిలర్లు ప్రత్యేక క్యాంపు నుంచి నేరుగా సమావేశానికి హాజరయ్యారు. బలపరీక్షలో జాహ్నవిని ఓడించడానికి ముందుగానే స్కెచ్ వేయగా.. వీరికి బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్య నేత అండగా నిలిచినట్లు తెలుస్తోంది. అవిశ్వాసానికి అనుకూలంగా 27 మంది చేతులు ఎత్తడంతో తీర్మానం నెగ్గింది. దీంతో కొత్త ఛైర్మన్‌గా గడ్డం ఇందుప్రియను ఎన్నుకున్నారు. బీజేపీ కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాలేదు. ఇందుప్రియ కామారెడ్డి 8వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్నారు. ఆమె అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గడంతో కాంగ్రెస్ కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం బయట టపాసులు కాల్చి స్వీట్లు పంచుతూ తమ ఆనందాన్ని పంచుకున్నారు.

## భారాస నేతలు అయోమయంలో ఉన్నారు: కడియం శ్రీహరి



హైదరాబాద్: భారాస నేతలు అయోమయంలో ఉన్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆ పార్టీని వీడేందుకు సిద్ధమైన ఆయన తదుపరి కార్యాచరణపై దృష్టి సారించారు. కాంగ్రెస్ ఆహ్వానం నేపథ్యంలో ఆ పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు కుమార్తె కావ్యతో కలిసి మంత్రుల నివాస ప్రాంగణంలో తన అనుచరులతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ నేతలు తనను పార్టీలోకి ఆహ్వానించారని, రెండ్రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తానని చెప్పినట్టు తెలిపారు. కడియం ఏ నిర్ణయం తీసుకున్నా మద్దతిస్తామని ఆయన అనుచరులు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారాస బలహీనపడిందన్న కడియం.. పార్టీ నేతల నుంచి సహకారం లభించలేదని తెలిపారు. ఓడిపోయే పార్టీ నుంచి పోటీ వద్దని కావ్య అనుకున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేయమని పిలుపు వచ్చిందని, అందరి అభిప్రాయం మేరకు నిర్ణయం ఉంటుందన్నారు. ఆరూరి రమేష్ వద్దంటేనే కావ్యకు టికెట్ ఇచ్చారని చెప్పారు. తనను విమర్శించే నైతిక హక్కు ఎవరికీ లేదన్న ఆయన.. కావ్యను నిండు మనసుతో ఆశీర్వదించాలని కోరారు.

## బీఆర్ఎస్‌లో మరో వికెట్ డౌన్.. కాంగ్రెస్ కండువా కప్పుకోనున్న ఎమ్మెల్యే..!



అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కారు పార్టీని వీడతారంటూ ప్రచారం జరగ్నుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. గ్రేటర్ పరిధిలో ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ద్వారా రానున్న లోక్‌సభతో పాటు.. కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపొందచ్చనే అంచనాలో హస్తం పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. గులాబీ బాస్ కేసీఆర్‌కు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది కాంగ్రెస్ పార్టీ. గేట్లు ఓపెన్ చేశామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల తర్వాత.. బీఆర్ఎస్ నేతలు హస్తం పార్టీలోకి క్యూ కడుతున్నారు. గత పదేళ్లుగా కేసీఆర్ వెంట నడిచిన నాయకులు పార్టీని వీడి పక్క పార్టీల్లో చేరుతున్నారు.

ఇప్పటికే కే కేశవరావు, కడియం శ్రీహరి వంటి వారు బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పగా.. తాజాగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కారు పార్టీని వీడతారంటూ ప్రచారం జరగ్నుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎక్కువమంది గెలిచారు. దీంతో గ్రేటర్ పరిధిలో ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడం ద్వారా రానున్న లోక్‌సభతో పాటు.. కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపొందచ్చనే అంచనాలో హస్తం పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది.


**కీసరలో సమావేశం..** కీసరలోని ఓ ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గం నేతలతో ఆయన రేపు సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. తన భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నేతలతో కాలేరు వెంకటేష్ టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. గత నాలుగు రోజులుగా కాలేరు వెంకటేష్ పార్ట కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు.

మరోవైపు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అందుబాటులో లేకపోవడంతో ఇవాల్టి కేటీఆర్ అంబర్ పేట పర్యటన వాయిదా వేసుకున్నారు. రెండు, మూడు రోజుల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కారు దిగి కాంగ్రెస్‌లోకి వెళ్తారనే ప్రచారం జరుగుతోంది.

## జమ్ము కశ్మీర్‌కు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

శ్రీనగర్, మార్చి30: జమ్ము కశ్మీర్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనున్నారు. ఆ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో 27 మంది స్టార్ కాంపేయనర్లు పాల్గొన్నారు. అందుకు సంబంధించిన జాబితాను ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కే.సీ వేణుగోపాల్.. కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శికి శనివారం అందజేశారు. ఆ జాబితాలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతోపాటు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక వాద్రా, రేవంత్ రెడ్డి తదితరులు ఉన్నారు. ఇక కేంద్ర పాలిత ప్రాంతం జమ్ము కాశ్మీర్‌లో 5 విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 19న ఉదంపూర్‌లో.. ఏప్రిల్ 26న జమ్ములో.., మే 7న అనంతనాగ్, రాజోరీల్లో.., మే 13న శ్రీనగర్‌లో.., మే 20న బారాముల్లాలో జరగనున్నాయి. ఇక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4వ తేదీన జరగనుంది. అయితే జమ్ము కాశ్మీర్ లోక్‌సభ ఎన్నికల అనంతరం ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు.. ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఆ రాష్ట్రంలో జరుగుతోన్న తొలి లోక్ సభ ఎన్నికలు. అయితే జమ్ము కశ్మీర్ ఓటర్ల నాడి ఎలా ఉందన్నది ఈ ఎన్నికల ఫలితాల సరళి బట్టి అర్థమవుతోందని రాజకీయ వర్గాల్లో ఓ చర్చ సైతం సాగుతోంది.

## కాలేజీ విద్యార్థికి రూ.46 కోట్ల పన్ను నోటీసులు..




గ్వాలియర్: కాలేజీకెళ్లి చదువుకునే విద్యార్థి బ్యాంకు ఖాతా నుంచి రూ.46 కోట్ల లావాదేవీలు జరిగాయి. దీంతో ఆదాయపు పన్ను అధికారులు అతడికి పన్ను నోటీసులు పంపారు. కంగుతిన్న ఆ విద్యార్థి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. మధ్యప్రదేశ్‌లో వెలుగు చూసిందీ ఘటన. వివరాల్లోకి వెళితే.. గ్వాలియర్‌కు చెందిన ప్రమోద్ కుమార్ దండోటియా స్థానిక కళాశాలలో చదువుకుంటున్నాడు. ఇటీవల అతడికి ఐటీ, జీఎస్‌టీ నుంచి పన్ను నోటీసులు వచ్చాయి. అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ.46 కోట్ల లావాదేవీలు జరిగాయని, అందుకు గానూ పన్ను చెల్లించాలనేది వాటి సారాంశం. దీంతో ఆ విద్యార్థి సంబంధిత అధికారులను సంప్రదించగా తన పాన్ కార్డుపై ఓ కంపెనీ రిజిస్టర్ అయినట్లు తెలిసింది. ఆ కంపెనీ 2021 నుంచి ముంబయి, దిల్లీ వేదికగా కార్యకలాపాలు సాగించిందని తెలుసుకున్న అతడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ లావాదేవీలకు తనకు ఎలాంటి సంబంధం లేదని, ఆ కంపెనీ గురించి తనకు తెలియదని పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. "ఆ విద్యార్థి పాన్ కార్డును గుర్తుతెలియని వ్యక్తులు దుర్వినియోగం చేసి కంపెనీని రిజిస్టర్ చేశారు. ఆ తర్వాతే అతడి బ్యాంకు అకౌంట్ నుంచి రూ.కోట్లలో లావాదేవీలు జరిగాయి. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది" అని పోలీసులు వెల్లడించారు.

ప్రభాత
సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660